# బలగం TV BALAGAM

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 17 సెప్టెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## తెలంగాణలో ఐఏఎస్ అధికారుల బదిలీలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ప్రభుత్వంలో పలు కీలక ఐఏఎస్ అధికారుల బదిలీలు చోటుచేసుకున్నాయి. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

హైదరాబాద్ మెట్రో రైలు ఎండీగా సర్ఫరాజ్ అహ్మద్‌ను నియమించారు.

ఇప్పటి వరకు మెట్రో ఎండీగా ఉన్న ఎన్‌వీఎస్ రెడ్డికి హెచ్‌ఆర్‌ఎం ఎండీ బాధ్యతలు అప్పగించారు.

మహిళ, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్‌గా శృతి ఓజా బదిలీ అయ్యారు.

ఎస్సీ గురుకులాల కార్యదర్శిగా కృష్ణ ఆదిత్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

హెచ్ఎండీఏ కార్యదర్శిగా కోట శ్రీనివాత్సకు అదనపు బాధ్యతలు ఇచ్చారు.

హెచ్ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్లుగా ఆర్. ఉపేందర్‌రెడ్డి, టీ. వెంకన్నలు నియమితులయ్యారు.

హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ అధికారిగా ఎం. రాజిరెడ్డి నియమితులయ్యారు.

ఆదిలాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా రాజేశ్వర్ బదిలీ అయ్యారు.

ఇదిలా ఉండగా.. ప్రభుత్వ పట్టణ రవాణా సలహాదారుగా ఎన్‌వీఎస్ రెడ్డి నియమితులయ్యారు. ఈ పదవిలో ఆయన రెండేళ్ల పాటు కొనసాగనున్నారు.

# ఉత్తరాఖండ్‌లో మరోసారి క్లౌడ్ బరస్ట్

- **మెరుపు వరదలతో ఇళ్లు,రోడ్లు ధ్వంసం**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



ఉత్తరాఖండ్‌లో మరోసారి క్లౌడ్ బరస్ట్ సంభవించింది. డెహ్రాడూన్‌లో మెరుపు వరదలు బీభత్సం సృష్టించాయి. సహస్త్రధారలో వరద ధాటికి పలువురు గల్లంతయ్యారు. వరదతో పాటు వచ్చిన బురద,ఇతర శిథిలాల తాకిడికి అనేక ఇళ్లు,దుకాణాలు, హోటళ్లు దెబ్బతిన్నాయి. రహదారుల పైకి భారీగా వరద చేరడంతో వాహనాలు నీటిలో కొట్టుకు పోయాయి. రిషికేశ్‌లో చంద్రభాగానది ప్రమాదకర స్థితిలో ప్రవహిస్తోంది. నదీ ప్రవాహంలో చిక్కుకున్న ముగ్గురిని ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది రక్షించారు. తమ్సా, టన్స్, సాంగ్ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. డెహ్రూడూన్‌లో సహస్త్రధార ప్రాంతంలో వరదలు సంభవించి రోడ్లు కొట్టుకుపోయాయని రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం మంగళవారం వెల్లడించింది. ఈ వరదల్లో చిక్కుకుపోయిన వారికి ఎస్‌డిఆర్ఎఫ్ బృందం సహాయక చర్యలు చేపట్టింది. ఇక ఉత్తరాఖండ్ జిల్లాలో వరదలు రావడంతో ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారని సమాచారం. దేవభూమి ఇనిస్టిట్యూట్ విద్యార్థులతో సహా వంద మందికిపైగా ప్రజలను రెస్క్యూ దళం కాపాడింది. వర్షాల వల్ల సహస్త్రధార, మాల్ దేవతా, ముస్సోరీ ప్రాంతాల్లో తీవ్ర నష్టం వాటిల్లినట్లు- విపత్తు నిర్వహణ కార్యదర్శి వినోద్ కుమార్ సుమన్ తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ సిబ్బంది బృందాలుగా ఏర్పడి 300 - 400 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.కాగా, ఈ వరదల వల్ల సహస్త్రధార, డెహ్రాడూన్‌లో కొత్త దకాణలు దెబ్బతిన్నాయి. ఈ వార్తవిని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి విచారం వ్యక్తం చేశారు. మంగళవారం డెహ్రాడూన్‌లో, సహస్త్రధార ప్రాంతాల్లో పర్యటించారు.

# రాష్ట్రంలో మూడో డిస్కం

- **వచ్చే రెండున్నరేళ్లలో కోర్ అర్బన్ రీజియన్‌లో అండర్ గ్రౌండ్ కేబులింగ్ పూర్తి చేయాలి**
- **ఎక్కడ కొత్త సబ్ స్టేషన్ అవసరమో గుర్తించాలి**
- **ఓవర్‌లోడ్ సమస్యలు తలెత్తకుండా లోడ్ రీప్లేస్‌మెంట్ చర్యలు చేపట్టాలి.**
- **సబ్ స్టేషన్ సామర్థ్యంకన్నా ఒక్క కనెక్షన్ కూడా ఎక్కువ కాకుండా జాగ్రత్త వహించాలి.**
- **అవసరమైన చోట సబ్ స్టేషన్ సామర్థ్యాన్ని పెంచుకోవాలి.**
- **విద్యుత్ కేబుళ్లతో పాటు ఇతర కేబుళ్లు కూడా అండర్ గ్రౌండ్ వ్యవస్థలో ఉండేలా చూడాలి.**
- **సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థలకు సంబంధించి ప్రస్తుతం ఉన్న రెండు డిస్కంలను మూడు డిస్కంలుగా పునర్విభజన చేయాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. మంత్రిమండలి ఆమోదం తర్వాత మూడో డిస్కంపై ముందుకు వెళ్లాలని చెప్పారు.ఇందన శాఖపై ముఖ్యమంత్రి గారు, ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారితో కలిసి ఇంధన శాఖ, సంబంధిత శాఖల ఉన్నతాధికారుల సమావేశంలో సుదీర్ఘంగా సమీక్షించారు. మూడవ డిస్కం ఏర్పాటుకు వీలైనంత తొందరగా పూర్తిస్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని, సంబంధిత పీపీఏ అలొకేషన్, సిబ్బంది, ఆస్తుల విభజన, బకాయిలు, ఇతర అంశాలపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు అధికారులకు పలు సూచనలు చేశారు.

రాష్ట్రంలో సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ , నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్‌లతో పాటు మరో డిస్కం ఏర్పాటు ప్రతిపాదనలపై ఇంధన శాఖ సిద్ధం చేసిన ప్రాథమిక ప్రణాళికను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వ్యవసాయం, మేజర్, మైనర్ లిఫ్ట్ ఇరిగేషన్, గ్రామీణ మంచినీటి సరఫరా, జీహెచ్ఎంసీ పరిధిలో మంచినీటి సరఫరాకు సంబంధించిన విద్యుత్ వినియోగాన్ని కొత్త డిస్కం పరిధిలోకి తేవాలన్న ప్రతిపాదనలను వివరించారు.

గ్రేటర్ హైదరాబాద్‌లో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబులింగ్ విధానంపై పలు ప్రతిపాదనలు, డీపీఆర్ తయారీకి సంబంధించిన అంశాలను ముఖ్యమంత్రి గారికి వివరించారు. వీటితో పాటు కోర్ అర్బన్ రీజియన్‌లో విద్యుత్ సబ్ స్టేషన్లను అధునీకరించే అంశాలను తెలియజేశారు. వచ్చే రెండున్నరేళ్లలో కోర్ అర్బన్ రీజియన్‌లో అండర్ గ్రౌండ్ కేబులింగ్ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు పలు సూచనలు చేశారు. కోర్ అర్బన్ రీజియన్‌లో ఎక్కడెక్కడ కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ల అవసరం ఉందో గుర్తించాలి. ఓవర్ లోడ్ సమస్య తలెత్తకుండా లోడ్ రీప్లేస్మెంట్ చర్యలు చేపట్టాలి.

సబ్ స్టేషన్ సామర్థ్యంకన్నా ఒక్క కనెక్షన్ కూడా ఎక్కువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరమైన చోట సబ్ స్టేషన్ సామర్థ్యాన్ని పెంచుకోవాలి. విద్యుత్ సబ్ స్టేషన్‌లలో అధునాతన సాంకేతికతను ఉపయోగించాలి. విద్యుత్ కేబుళ్లతో పాటు ఇతర కేబుళ్ల సైతం అండర్ గ్రౌండ్ వ్యవస్థను ఉపయోగించుకునేలా ఉండాలి. దీనిపై బెంగుళూరుతో పాటు ఇతర రాష్ట్రాల్లో అండర్ గ్రౌండ్ కేబులింగ్ ప్రాజెక్టులను అధ్యయనం చేయాలి. వచ్చే డిసెంబర్‌లోగా ఈ ప్రాజెక్టుకు సంబంధించి పూర్తిస్థాయి ప్రణాళికలు రూపొందించాలి.

### 317 జీవో
## బాధిత ఉద్యోగులకు తాత్కాలిక ఉపశమనం

- **2 లేదా 3 ఏండ్ల వరకు డిప్యూటేషన్లకు అవకాశం**
- **ఉత్తర్వులు విడుదల**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో 317 జీవో బాధిత ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలిక ఉపశమనం కలిగించింది. డిప్యూటేషన్లకు అవకాశమిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె రామకృష్ణారావు ఉత్తర్వులు (జీవోనెంబర్ 190) మంగళవారం విడుదల చేశారు. ఖాళీల లభ్యతను బట్టి జిల్లాల అధికారులు డిప్యూటేషన్లు కేటాయిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 317 జీవోపై అధ్యయనం కోసం 2022, ఏప్రిల్ నాలుగో తేదీన మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిం చిందని తెలిపారు. ప్రభుత్వ కార్యదర్శులు, వివిధ శాఖ విభాగాధిపతులు, ఇతర అధికారులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులతో సమావేశాలను నిర్వహించిందని పేర్కొన్నారు.

వారి అభ్యర్థనలు, ఫిర్యాదులను పరిశీలించి గతేడాది అక్టోబర్ 20వ తేదీన ప్రభుత్వానికి నివేదికను సమర్పించిందని వివరించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల కష్టాల కారణంగా తాత్కాలికంగా బదిలీ లేదా డిప్యూటేషన్ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. కానీ స్థానిక క్యాడర్‌లో ఎలాంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. ఈ రకమైన బదిలీలు రెండు లేదా మూడేండ్లపాటు మాత్రమే ఉంటాయని వివరించారు. అవసరమైతే విభాగాల్లో రొటేషన్ ద్వారా మరింత మంది అర్హులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అవకాశం ఇవ్వొచ్చని సూచించారు. ప్రభుత్వ సిఫారసులకు అనుగుణంగా మొదట రెండేండ్లపాటు అవసరమైతే మరో ఏడాది పొడిగించొచ్చని కోరారు. పదవీకాలం ముగిసిన తర్వాత తప్పనిసరిగా మాతృక్యాడర్‌కు తిరిగి వెళ్లాలని ఆదేశించారు. శిక్షా చర్యలు ఎదుర్కొంటున్న వారు అర్హులు కాదని తెలిపారు. టీఏ, డీఏ హక్కు ఉండబోదని స్పష్టం చేశారు. ఆర్థికశాఖ అనుమతి అవసరమని పేర్కొన్నారు. ఒకసారి డిప్యూటేషన్ పొందిన ఉద్యోగికి మళ్లీ అర్హత ఉండబోదని వివరించారు. ఈ సౌకర్యం కేవలం ఉద్యోగులు, ఉపాధ్యాయులు పనిచేస్తున్న ప్రదేశం లేదా బదిలీ అయిన ఉద్యోగులకే వర్తిస్తుందని స్పష్టం చేశారు. 317 జీవో బాధితులుగా ఉండి ఇప్పటి వరకు 21 జీవో, 243, 244, 245 జీవోల ద్వారా ప్రయోజనం పొందని వారికే వర్తిస్తుందని వివరించారు. మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు మేరకు రాష్ట్రంలో

మిగితా 2వ పేజీలో

# విద్యుత్ శాఖ ఏడీఈ అక్రమాస్తులు..

- **ఏడీఈ అంబేద్కర్ అరెస్టు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



రాష్ట్ర అవినీతి నిరోధక శాఖకు మరో భారీ అవినీతి తిమింగళం చిక్కింది. విద్యుత్ శాఖ ఇబ్రహీం బాగ్ ఆపరే షన్స్ అడిషనల్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ) అంబేద్కర్ అక్రమా స్తులు దాదాపు 150 కోట్లకు పైనేనని ఏసీబీ అధికా రులు అంచనా వేస్తున్నారు. మంగళవారం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ఏడీఈ ఆస్తులపై ఏసీబీ అధికారులు జరిపిన ఆకస్మిక సోదాల్లో విస్మయపరిచే అంశాలు వెలుగులోకొచ్చాయి. ఏసీబీ డైరెక్టర్ జనరల్ విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏడీఈ అంబేద్కర్ అవినీతి అక్రమాలకు పాల్పడి కోట్లాది రూపాయల ఆస్తులు సంపాదించినట్టుగా ఏసీబీకి సమాచారం అందింది. దీంతో ఏసీబీకి చెందిన 14 బృందాలు రంగంలోకి దిగి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని అంబేద్కర్ అక్రమాస్తులపై సోదాలు నిర్వహించాయి. ఈ సోదాల్లో శేరిలింగంపల్లిలో ఒక ఇల్లు, గచ్చిబౌలిలో జీ ప్లస్ ఫైవ్ భవనం బయటపడ్డాయి. అలాగే అమృస్తార్ కెమికల్స్ పేరిట పది ఎకరాల్లోని ఫార్మాసూటికల్స్ కంపెనీ కూడా అంబేద్కర్ పేరిట ఉన్నట్టు తేలింది. ఇక హైదరాబాద్ నగరంలోని పది ఓపెన్ ప్లాట్లు, నగర శివారులో పది ఎకరాల వ్యవసాయ భూమితో పాటు ఇంట్లో లక్షల రూపాయల విలువైన బంగారు నగలతో పాటు భారీ మొత్తంలో నగదు బయటపడింది. అలాగే రెండు విలువైన వాహనాలతో పాటు నగర శివారుల్లోని అంబేద్కర్ బినామి నివాసంలో 2కోట్ల 18లక్షల రూపాయల నగదు కూడా ఏసీబీ అధికారులకు పట్టుబడింది.ఇవేకాక మరికొన్ని విలువైన ఆస్తులు కూడా అంబేద్కర్ కలిగినట్టుగా ఏసీబీకి సమాచారం అందడంతో అధికారులు వాటి కోసం ఆరాతీస్తున్నారు. ఇతని పేరిట బ్యాంకుల్లో ఉన్నటువంటి లాకర్లను కూడా తెరవడానికి ప్రయత్నాలు సాగిస్తున్నారు. దీంతో ఆదాయానికి మించిన ఆస్తుల కేసును అంబేద్కర్‌పై నమోదు చేసి.. నిందితున్ని అరెస్టు చేసి జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించినట్టు ఏసీబీ డీజీ విజయకుమార్ తెలిపారు. అంబేద్కర్ అక్రమాస్తుల విలువ మార్కెట్ విలువ ప్రకారం 150కోట్లకుపైనే ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంకా ఇతర ఆస్తులపై సోదాలు కొనసాగుతున్నాయని సంబంధిత అధికారులు తెలిపారు.

### జీఎస్టీ రేట్ల సవరణతో
## రూ.5 వేల కోట్ల ఆదాయాన్ని కోల్పోతోన్న ప్రభుత్వం



- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**
- **వ్యాపార వర్గాలతో డిప్యూటీ సీఎం భేటీ**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జీఎస్టీ రేట్ల సవరణతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీయేటా రూ.5 వేల కోట్ల ఆదాయాన్ని కోల్పోతోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అయినా పేద, మధ్యతరగతి, రైతు కుటుంబాల మేలు కోసం జీఎస్టీ రేషనలైజేషన్ చేపట్టాలంటూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర మంత్రివర్గం ఒక విధాన నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు.

జీఎస్టీ రేట్ల సవరణ నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో వ్యాపార వర్గాలతో డిప్యూటీ సీఎం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ కౌన్సిల్ సభ్యుడిగా ప్రజల తరపున నిర్ణయాలు తీసుకోవడంలో తాను ప్రముఖ పాత్ర పోషిస్తున్నానని తెలిపారు. జీఎస్టీ రేట్ల సవరణ కోట్లాది మందికి ఉపయోగపడే కార్యక్రమమని చెప్పారు. సవరించిన రేట్లతో పెద్ద సంఖ్యలో వస్తువులు తక్కువ ధరలకు అందుబాటులోకి వస్తున్నాయి.. ఆ ఫలాలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం, వ్యాపారులపై ఉందని తెలిపారు. జీఎస్టీలో సులభమైన విధానం తెచ్చేందుకు ఢిల్లీలో సుదీర్ఘ చర్చలు జరిగాయని వివరించారు.బేషజాలకు పోకుండా తీసుకున్న నిర్ణయాలు రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం, వ్యాపారులు కలిసి నడిస్తేనే ప్రగతి సాధ్యమవుతుందని నొక్కి చెప్పారు.

పన్నుల విధానం సరళంగా, సక్రమంగా ఉండాలని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు. వ్యాపారులు మనసు కష్ట పెట్టుకోకుండా రేట్ల సవరణ ద్వారా తగ్గిన వస్తువుల ధరలను దుకాణాల ముందు ప్రదర్శించాలని సూచించారు. తద్వారా జీఎస్టీ రేట్ల రేషనలైజేషన్ తర్వాత, అంతకుముందు వివిధ వస్తువుల ధరలు ఏ విధంగా ఉన్నాయో ప్రజలకు వివరించాలని కోరారు. రేట్ల సవరణతో వ్యవసాయ రంగానికి అవసరమైన పరికరాల ధరలు, ఆహార ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గుతాయని అన్నారు. సిమెంట్ జీఎస్టీ స్లాబ్‌ను 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించారు, ఫలితంగా సిమెంటు ధరలు తగ్గుతాయని అన్నారు. ఫలితంగా నిర్మాణరంగంలో భారీ పెరుగుదలకు అవకాశాలు ఏర్పడతాయని డిప్యూటీ సీఎం వివరించారు. హైదరాబాద్ ఒక నగర రాజ్యాంగ మారుతోంది, రాష్ట్రవ్యాప్తంగా అర్బనైజేషన్ పెరుగు తోంది. ఇది మౌలిక వసతుల రంగంలో వ్యాపారాన్ని వ్యవస్థీకృతం చేసుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. తగ్గుతున్న సిమెంటు ధరల వివరాలను

మిగితా 2వ పేజీలో

## అమెరికా-భారత్ చర్చలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అమెరికా-భారత్‌ల మధ్య వాణిజ్య సంబంధాలు దెబ్బతిన్న తరుణంలో తాజాగా ఇరుదేశాల మధ్య జరిగిన చర్చలు సానుకూల వాతావరణంలో సాగాయి. వాణిజ్య ఒప్పందం కోసం త్వరలోనే ద్వైపాక్షిక చర్చలను వేగవంతం చేయాలని ఇరుదేశాలు అంగీకరించాయని అమెరికా ప్రతినిధి బ్రెండన్ లించ్ వెల్లడించారు. న్యూఢిల్లీలోని వాణిజ్య భవన్‌లో అమెరికా ప్రతినిధి బ్రెండన్ లించ్ నేతృత్వంలోని బృందం, భారత వాణిజ్యశాఖ అధికారి రాజేశ్ అగర్వాల్ ఆధ్వర్యంలోని బృందంతో భేటీ అయింది. అనంతరం వాణిజ్యశాఖ ప్రకటనలో.. వాణిజ్య ఒప్పంద ప్రాముఖ్యతను ఇరుదేశాలు గుర్తించడంతో పాటు అనేక అంశాలపై చర్చలు కొనసాగినట్లు తెలిపింది.

గమనించదగ్గ విషయం ఏమిటంటే, భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 50 శాతం సుంకాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన తర్వాత ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చలు అనిశ్చితిలోకి వెళ్లాయి. అయితే ప్రధాని నరేంద్ర మోదీతో ట్రంప్ సత్సంబంధాలు, ఇరువురి మధ్య పరస్పర అనుకూల వ్యాఖ్యలు ఇరుదేశాల సంబంధాల్లో కొంత మెరుగుదలకు దోహదపడ్డాయి.

## మెట్రో సెక్యూరిటి గార్డులుగా ట్రాన్స్‌జెండర్లు

- **20మందికి నియామక పత్రాలు అందచేత**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ మెట్రో లో 20 మంది ట్రాన్స్‌జెండర్లను తెలంగాణ ప్రభుత్వం సెక్యూరిటీ గార్డులుగా నియమించింది.. ఈ క్రమంలో మెట్రో రైల్ లిమిటెడ్ సెక్యూరిటీ- గార్డులుగా నియమిస్తూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నియామక పత్రాలు అందజేశారు. సెక్యూరిటీ- గార్డు నియామకాల కోసం దాదాపు 300 నుంచి 400 మంది దరఖాస్తు చేసుకోగా, నైపుణ్యం కలిగిన వారిని ఎంపిక చేసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు.

మిగితా 2వ పేజీలో

# ఎన్ని తమాషాలు చేసినా ఉప ఎన్నికలు తప్పవు




- **పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఎందుకు పిరికివాళ్లయ్యారో చెప్పాలి**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కాంగ్రెస్ పార్టీ నైజమే మోసమని, అబద్ధాల పునాదుల మీదే ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ భవన్‌లో భద్రాచలం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని అన్నారు.

"రేవంత్ రెడ్డి మాయమాటలకు మోసపోయిన ప్రజల తప్పు కాదు. పాత కాంగ్రెస్ పాలనలోని రోజులను తిరిగి తీసుకువచ్చారు. పాలన నడిపే సత్తా లేక ప్రతిసారీ పాత ప్రభుత్వంపైనే నెపం నెడుతున్నారు" అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.ఉప ఎన్నికల అంశంపై మాట్లాడుతూ.. "ఎన్ని తమాషాలు చేసినా ఉప ఎన్నికలు తప్పవు. కాంగ్రెస్‌కు ఓటమి ఖాయం" అని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు పిరికితనానికి పాల్పడ్డారని విమర్శించారు. కాంగ్రెస్‌కు నిజంగా ధైర్యం ఉంటే ఫిరాయించిన ఎమ్మెల్యేలను చేర్చుకున్న తర్వాత ఉప ఎన్నికలకు వెళ్లాలని సవాల్ విసిరారు. మంత్రి పొంగులేటిపై కూడా కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "గారెలు బుట్టలో పడినట్టు, లక్కీ లాటరీలో మంత్రి అయిన పొంగులేటి పెద్దగా మాట్లాడుతున్నారు. ఏడాది క్రితం ఆయన ఇంటిపై జరిగిన ఈడీ దాడుల గురించి ఎవరూ మాట్లాడటం లేదు. ఆ డబ్బుల సంగతేమిటి? పొంగులేటి బీజేపీతో కుమ్మక్కయ్యాడా? లేక రేవంత్‌తో కలిసి బీజేపీకి వంగిపోయాడా?" అని ప్రశ్నించారు.

"ప్రజాస్వామ్యంలో అహంకారం ఎక్కువైతే తిప్పికొడతారు. మళ్లీ పాలేరు ఎన్నికల్లో ఎలా గెలుస్తారో చూద్దాం" అంటూ కేటీఆర్ సవాల్ విసిరారు.

**కాంగ్రెస్ అసమర్థ విధానాలతో హైదరాబాద్ కుప్పకూలింది : కేటీఆర్**

హైదరాబాద్ నగర ఆర్థిక వ్యవస్థ

మిగితా 2వ పేజీలో

### నల్లగొండ
## పోక్సో కోర్టు సంచలన తీర్పు

- **బాలికపై లైంగికదాడి కేసులో కామంధుడికి 24 ఏండ్ల జైలు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు పోక్సో, నిర్భయ, దిశ లాంటి ఎన్ని కఠిన చట్టాలు తెచ్చినా వారిపై అఘాయిత్యాలు మాత్ర ఆగడం లేదు. చిన్నాపెద్దా అన్న తేడా లేకుండా కొందరు కామాంధులు రాక్షసత్వంగా ప్రవర్తిస్తున్నారు. మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులకు ఒడిగడుతున్నారు. వయసుతో సంబంధం లేకుండా ఆడవారు ఒంటరిగా కనిపిస్తే చాలు అత్యాచారాలకు పాల్పడుతన్నారు. విచక్షణ మరచి దారుణాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నల్గొండ పోక్సో న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. 2023 సంవత్సరం మార్చి నెలలో అన్నెపర్రి గ్రామానికి చెందిన మర్రి ఊషయ్య అనే 60 ఏళ్ల వ్యక్తి, 4వ తరగతి విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న

కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నల్లగొండ పోక్సో కోర్టులో వాదనలు కొనసాగుతున్నాయి. అయితే తాజాగా విచారణ ముగియడంతో.. కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. ఊషయ్యకు 24 ఏళ్ల కారాగార శిక్ష, రూ. 40 వేల జరిమానా విధిస్తూ.. కోర్టు తీర్పు వెలువరించింది. కోర్టు తీర్పుతో బాధిత కుటుంబం హర్షం వ్యక్తం చేసింది. పోక్సో కోర్టు తీర్పుపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

## 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ - 2025'

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**




తెలంగాణలోని యువ కంటెంట్ క్రియేటర్లకు పట్టం కట్టేందుకు తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ - 2025' పేరిట షార్ట్ ఫిలిమ్స్ పోటీలు నిర్వహిస్తోంది. 3 నిమిషాలు, 5 నిమిషాల లోపు నిడివి కలిగిన రెండు కేటగిరీల్లో షార్ట్ ఫిలిమ్స్ లేదా పాటలు పంపించాలని ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు గారు కోరారు.

మిగితా 2వ పేజీలో

# పిల్లల భవిష్యత్తుతో రాజకీయాలు వద్దు



- **గ్రూప్-1 ర్యాంకర్లు కష్టపడి చదివారు**
- **వారిని చులకన చేసి మాట్లాడడం సరికాదు**
- **మీడియా సమావేశంలో ర్యాంకర్ల తల్లిదండ్రుల ఆవేదన**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పిల్లల భవిష్యత్తుతో రాజకీయాలు వద్దని గ్రూప్-1 ర్యాంకర్ల తల్లిదండ్రులు కోరారు. తమ పిల్లలు కష్టపడి చదివి ర్యాంకులు సాధిస్తే కోట్లు పెట్టి కొన్నారని అభాండాలు వేస్తున్నారని వాపోయారు. రూ.3 కోట్లు- ఇచ్చి ఉద్యోగాలు కొనుక్కున్నారని కొందరు ఆరోపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంత డబ్బే ఉంటే తమ పిల్లఉ ఉద్యోగాలు కొనుక్కోవాల్సిన ఖర్మ లేదన్నారు.

ఇటీవలి హైకోర్టు తీర్పు, వస్తున్న ఆరోపణల నేపథ్యంలో గ్రూప్-1 ర్యాంకర్లు, వారి తల్లిదండ్రులు కొందరు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈనెల 9న గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. గ్రూప్-1 పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని వాటిని రద్దు చేయాలని కోరుతూ కొందరు, వాటిని రద్దు చేయరాదంటూ మరికొందరు దాఖలు చేసిన 12 పిటిషన్‌లపై విచారించిన హైకోర్టు.. 222 పేజీల తీర్పును వెలువరించింది. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు మీడియా సమావేశం నిర్వహించారు.అసత్య ఆరోపణలతో మనోవేదనకు గురిచేస్తున్నారని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తూ కన్నీళ్లు పెట్టుకున్నారు.గ్రూప్-1 పరీక్షల వివాదాన్ని రాజకీయం చేయొద్దని,. కొందరు నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఆరోపణలు చేసేవారు వాటిని నిరూపించాలన్నారు. అప్పులు చేసి, ఓ పూట తిని.. మరో పూట తినక రెక్కలు ముక్కలయ్యేలా మా పిల్లలను కష్టపడి చదివించాం. ఎన్నో త్యాగాలు చేసి చదివిస్తే రూ.3 కోట్లు- ఇచ్చి ఉద్యోగాలు కొనుక్కున్నట్లు నిందలు వేస్తున్నారు. మాకు అంత స్థోమత లేదు. మీ రాజకీయాల కోసం మా పిల్లల భవిష్యత్తును నాశనం చేయొద్దని వేడుకున్నారు. అంతటి స్థోమతే ఉంటే ఈ ఉద్యోగాల కోసం

వెంపర్లాడమని అన్నారు. పోస్టులు కొన్నామన్న ప్రచారంతో మా పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. అవమానాలకు గురవుతున్నారని,పోస్టులు కొనుక్కున్నామన్న ఆరోపణలపై ఎలాంటి విచారణకైనా మేం సిద్ధం అన్నారు. నిందలు వేసి మమ్మల్ని మనోవేదనకు

మిగితా 2వ పేజీలో

# మానవీయ కోణంలో ఆలోచన చేయాలి



- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్**

దశాబ్దాల కాలంగా భూములను సాగు చేసుకుంటున్న వారికి హక్కులు కల్పించే విషయంలో మానవీయ కోణంలో ఆలోచన చేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సచివాలయంలో మంగళవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని భూ సమస్యలపై అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి మంత్రి పొంగులేటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చిన్న చిన్న సమస్యలను జఠిలం చేయొద్దని అటవీశాఖ అధికారులకు సూచించారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో 40-50 ఏండ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూములపై గిరిజనులకు హక్కులు కల్పించడానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. అయితే వివిధ నిబంధనలు చూపుతూ ఆ భూములు అటవీ శాఖకు చెందినవని అధికారులు కొర్రీలు పెడుతున్నారన్నారు. ఈ అంశంపై రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు సమన్వయంతో పనిచేసి వీలైనంత త్వరగా పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూభారతి పైలట్ ప్రాజెక్టులో భాగంగా నాగార్జునసాగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని తిరుమలగిరి (సాగర్) మండలాన్ని ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా సర్వే నిర్వహించామన్నారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ కోసం 235 సర్వే నెంబర్లను ఎంపిక చేసినట్టు చెప్పారు. మొత్తం 23వేల ఎకరాల్లో సర్వే నిర్వహించి.. అందులో 12వేల ఎకరాలు ప్రభుత్వ భూమిగా గుర్తించామన్నారు. ఇందులో 8వేల ఎకరాలు సాగుకు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. వీటిలో 4 వేల ఎకరాలు పాసుపుస్తకాలతో సాగులో ఉన్నాయని వివరించారు. మిగిలిన 4037 ఎకరాలకు సంబంధించి కొత్త పాసుపుస్తకాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ సర్వేలో 2936 ఎకరాలకు సంబంధించి 3069 మంది వద్ద బోగస్ పాసు పుస్తకాలు ఉన్నట్టు గుర్తించి వాటిని రద్దు చేశామని తెలిపారు.

వీరికి రైతు భరోసా, రైతుబీమా తదితరాలు రద్దు చేశామన్నారు. సర్వేలో భాగంగా 7వేల ఎకరాల అటవీ భూమిని గుర్తించామని, ఈ భూములకు సంబంధించిన వివాదాలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి కె.జానారెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కె.జయవీర్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, రెవెన్యూ శాఖ సెక్రెటరీ డీఎస్.లోకేష్‌కుమార్, పీసీసీఎఫ్ డాక్టర్ సి.సువర్ణ, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ని తమాషాలు చేసినా ఉప ఎన్నికలు తప్పవు

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సృష్టించిన భయంతో కుప్పకూలిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. గత 22 నెలలుగా కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలు రాష్ట్ర ప్రజల్లో తీవ్ర అసంతృప్తి కలిగించాయని అన్నారు.జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికపై బీఆర్ఎస్ నిర్వహించిన సన్నాహక సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను అభివృద్ధి పథంలో నడిపింది గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన అని, కాని కాంగ్రెస్ విధానాలు నగరాన్ని పూర్తిగా దెబ్బతీస్తున్నాయని వ్యాఖ్యానించారు. "హైదరాబాద్ అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాల్సిందే" అని ఆయన పిలుపునిచ్చారు.

"కాంగ్రెస్ అసమర్థ విధానాల వల్ల అన్ని రంగాలు నష్టపోయాయి. సమాజంలోని ప్రతి వర్గం నష్టపోయింది. ప్రజలు ఈ విషయాన్ని బాగా గమనిస్తున్నారు" అని కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్‌లో జరిగిన ఈ సమావేశానికి పార్టీ సీనియర్ నేతలు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ఉప ఎన్నికలో కలిసికట్టుగా పనిచేసి, జూబ్లీహిల్స్ నుంచి బీఆర్ఎస్ విజయయాత్రను తిరిగి ప్రారంభించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ - 2025'

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు (మహిళలకు ఉచిత బస్సు, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ తదితరాలు), తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పండుగలు, కళారూపాలపై షార్ట్ ఫిలిమ్స్, పాటలను పోటీ కోసం పంపించాలి. సెప్టెంబర్ 30 లోపు ఎంట్రీలను పంపించాల్సి ఉంటుందని, నిర్దేశిత గడువులోగా అందిన ఎంట్రీలను నిపుణులతో కూడిన జ్యూరీ వీక్షించి ఎంపిక చేస్తారని దిల్ రాజు గారు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారికి భవిష్యత్తులోనూ అనేక రకాలుగా ప్రోత్సహిస్తామని చెప్పారు. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను దిల్ రాజు గారు విడుదల చేశారు.

ఎంట్రీలను ఈ కింది మెయిల్ ID: youngfilmmakerschallenge@gmail.com లేదా వాట్సాప్ నెంబర్ - 8125834009 (WhatsApp Only) కు పంపించాల్సి ఉంటుంది.

పోటీలో ఎంపికైన షార్ట్ ఫిలిమ్స్‌కు ప్రథమ బహుమతి 3 లక్షల రూపాయలు, ద్వితీయ బహుమతి 2 లక్షల రూపాయలు, తృతీయ బహుమతి 1 లక్ష రూపాయల చొప్పున అందిస్తారు. మరో ఐదుగురికి 20 వేల రూపాయల చొప్పున కన్సొలేషన్ బహుమతులు అందజేస్తారు. విజేతలకు నగదుతో పాటు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను ప్రదానం చేస్తారు.

పోటీలో పాల్గొనడానికి అర్హతలు:

1. ఈ పోటీలో పాల్గొనే వారి వయసు 40 ఏళ్ళ లోపు ఉండాలి.
2. కంటెంట్ 4కె రిజల్యూషన్ కలిగి ఉండాలి.
3. షార్ట్ ఫిల్మ్ / వీడియో సాంగ్స్ ఏవైనా ఈ పోటీలలో సూచించిన 'థీమ్' ల పైనే ఉండాలి.
4. మీరు చేసిన వీడియోలు గతంలో ఎక్కడా ప్రదర్శించి ఉండకూడదు.
5. బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ కోసం మాత్రమే చిత్రీకరించినవై ఉండాలి.

# పిల్లల భవిష్యత్తుతో రాజకీయాలు వద్దు

(మొదటి పేజీ తరువాయి)

గురిచేయొద్దు. అన్ని పార్టీల నేతలు సహకరించి మా బాధలు అర్థం చేసుకోవాలి. లేనిపోని దుష్ప్రచారాలు వ్యాప్తి చేయకుండా వాస్తవాలను తెలియ పరచాలని కోరారు. మా పిల్లలు ఎంతో కష్టపడి గ్రూప్-1 ర్యాంక్ సాధించారు. హైకోర్టు మాకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు కోరారు. భర్త చనిపోతే ఓ పాఠశాలలో రూ. 10వేల జీతానికి పనిచేస్తున్నా. రూ.30వేలు ఎప్పుడూ కళ్లతో చూడలేదు. రూ.3 కోట్లకు ఉద్యోగం కొన్నట్లు- నిరూపిస్తే నా మరణ శాసనం నేనే రాసుకుంటా. మా అబ్బాయికి అలాంటి ఉద్యోగం కూడా వద్దని 366వ ర్యాంకర్ తల్లి కన్నీటి పర్యంతమవుతూ చెప్పింది. ఎంతో కృషి పట్టుదలతో ర్యాంక్ సాధిస్తే.. కొంతమంది స్వార్థపరులు గ్రూప్-1ను రాజకీయం చేస్తున్నారు. ఓపిక, సహనంతో ఉన్నాం.. ఇప్పుడు చాలా బాధగా ఉంది. రూ. 3కోట్లు- కాదు.. రూ.30లక్షల బ్యాంక్ బ్యాలెన్స్ కూడా చూడలేదు. రాత్రిపగలు తేడా లేకుండా కూలి పనులు చేసుకుని చదివించాం. ఆధారాలతో ఆరోపణలు చేయండని 67వ ర్యాంకర్ తల్లి లలిత ఆవేదన చెందారు. రాజకీయ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారు. ఎన్నో త్యాగాలు చేసి చదివిస్తే రూ.3 కోట్లకు ఉద్యోగాలు కొన్నామని నిందలు వేస్తున్నారు. ఫలితాలు వచ్చాక కొత్తగా ఈ రాజకీయం చేస్తున్నారు. నిందలు వేసి మమ్మల్ని మనోవేదనకు గురిచేయొద్దని, 46వ ర్యాంకర్ తండ్రి ఆవేదన చెందారు. ఉద్యోగం అమ్మింది ఎవరు? కొన్నది ఎవరో ఆధారాలు చూపించాలి. నా కుమారుడికి గతంలో ఎన్నో ఉద్యోగం వస్తే గ్రూప్-1 కోసం చదివాడు. ఇప్పుడు ఇలా నిరాధార ఆరోపణలు చేయడమేంటని 60వ ర్యాంకర్ మహేష్ తండ్రి వాపోయాడు. ఇలా ఒక్కొక్కరు ఒక్కో తీరుగా తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

# మిస్టరీ మరణాలు గుట్టు తేలేనా

- అంతు చిక్కని ఆ నలుగురి మరణాలు

**బలగం టీవీ, తిరుపతి**

తిరుపతి జిల్లా పాకాల అడవిలో బయటపడిన మృతదేహాలు స్థానికంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మురం చేశారు. పాకాల మండలం గాదంకి టోల్‌ప్లాజా సమీపంలోని అడవిలో 2 మృతదేహాలు లభ్యమైనట్లు- తెలిపారు. అయితే.. మృతదేహాల పక్కనే 2 గోతులు తీసి పూడ్చిన ఆనవాళ్లు ఉన్నట్లు- పేర్కొన్నారు. ఆ రెండు గోతుల్లో చిన్నారుల మృతదేహాలు ఉన్నట్లు- అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులను పాతిపెట్టిన చోట మంగళవారం తవ్వకాలు జరపనున్నట్లు- పోలీసులు వెల్లడించారు. తిరుపతి సమీపంలోని పాకాల అడవిలో ఈనెల 14న మృతదేహాలను పోలీసులు గుర్తించారు. అందులో ఓ మృతదేహం పాండిచ్చేరికి చెందిన కల్లై సెల్వన్‌దే అని తేలింది. అదే ప్రదేశంలో లభించిన మృతదేహాలను అతడి వదిన జయమాలిని, ఆమె ఇద్దరు కుమార్తెలవని గుర్తించారు. నలుగురి మరణాలను హత్యలుగా పోలీసులు భావిస్తున్నారు. కాగా, మృతురాలు తన భార్య అంటూ.. వెంకటేశన్ అనే వ్యక్తి పోలీసులను ఆశ్రయించాడు. హత్యలకు వివాహేతర సంబంధమే కారణంగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పాకాల అడవిలో బాగా కుళ్లిన స్థితిలో మృతదేహాలు బయటపడ్డాయి. పశువుల కాపర్లు మృతదేహాలను చూసి, పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడ ఓ వ్యక్తి మృతదేహం చెట్టుకు వేలాడుతుండగా, పక్కనే వస్త్రం కప్పి ఉన్న మహిళ శవం ఉంది. ఆ పక్కనే మరో రెండు గోతులు తీసి పూడ్చిపెట్టిన ఆనవాళ్లు కనిపించాయి. అందులో చిన్నారుల మృతదేహాలు ఉండొచ్చని అనుమానిస్తున్నారు. గుంతలు తవ్వేందుకు ఉపయోగించిన పార సమీప చెట్లపొదల్లో లభ్యం అయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అయితే వారి మరణాలకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

## 317 జీవో
# బాధిత ఉద్యోగులకు తాత్కాలిక ఉపశమనం

(మొదటి పేజీ తరువాయి)

స్పౌజ్ (భార్యాభర్తలు), మ్యూచువల్ (పరస్పర), హెల్త్ (ఆరోగ్యం) కారణాలున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులను బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు స్థానికత కోల్పోయిన 317 జీవో బాధిత ఉద్యోగులు, ఉపాధ్యాయులకు డిప్యూటేషన్లు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**డిప్యూటేషన్‌కు అర్హతలు**

2021, జనవరి ఆరో తేదీన ఏ క్యాడర్‌లో ఉన్నారో ఆ ప్రాంతం, క్యాడర్‌లోనే పనిచేయాలి

పరస్పర, స్పౌజ్, హెల్త్ కారణాలతో బదిలీ అయిన వారు అనర్హులు

317 జీవోలో మొదటి ఆప్షన్ ఇచ్చిన జిల్లాకు కేటాయించిన వారూ అనర్హులు

317 జీవో తర్వాత పదోన్నతి పొందిన వారికి వర్తించదు

## జీఎస్టీ రేట్ల సవరణతో
# రూ.5 వేల కోట్ల ఆదాయాన్ని కోల్పోతోన్న ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

వ్యాపారులు తమ దుకాణాల ముందు ప్రదర్శించాలని కోరారు.

ఐటీసీ (ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్) అనేది వాస్తవంగా వ్యాపారం చేసే వారికి ఉపయోగకరం, అయితే అడ్డదారులు తొక్కే వారి వల్ల రాష్ట్ర ఆదాయానికి నష్టం చేకూరుతుందని ఆయన హెచ్చరించారు. నిబద్ధతతో స్వచ్ఛంగా వ్యాపారం చేసేవారు అడ్డదారులు తొక్కే వ్యాపారుల సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అందించాలని విజ్ఞప్తి చేశారు. వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులున్నా చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వ ద్వారాలు నిరంతరం తెరిచే ఉంటాయని డిప్యూటీ సీఎం భరోసానిచ్చారు. సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వాణిజ్య పన్నుల శాఖ ముఖ్య కార్యదర్శి రిజ్వీ, కమిషనర్ హరిత తదితరులు పాల్గొన్నారు. బీమా, డెయిరీ, ఎలక్ట్రానిక్ రంగాలకు చెందిన వ్యాపారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.



# మెట్రో సెక్యూరిటీగార్డులుగా ట్రాన్స్‌జెండర్లు

(మొదటి పేజీ తరువాయి)

ట్రాన్స్‌జెండర్ల అభ్యున్నతికి, వారు ఆత్మగౌరవంతో జీవించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంకల్పించారని.. ఈ నేపథ్యంలోనే వీరిని నియమించారని పేర్కొన్నారు. ట్రాన్స్‌జెండర్లు సమాజంలో గౌరవంగా బతకాలనే ఉద్దేశంతో ఈ అవకాశం కల్పించామని ఉద్ఘాటించారు. వారు కష్టపడి పనిచేయాలని సూచించారు. ఇతర ట్రాన్స్‌జెండర్లకు కూడా ఆదర్శంగా నిలవాలని చెప్పుకొచ్చారు. వీరు ఈ సమాజానికి ఏ మాత్రం తక్కువ కాదని నిరూపించుకోవాలని తెలిపారు. ట్రాన్స్‌జెండర్‌లకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి కచ్చితంగా అమలు చేస్తారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, విద్యాలయంలో కలెక్టర్ తనిఖీ



**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. మంగళవారం ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని విభాగాలు, వార్డులను పరిశీలించి, సిబ్బంది హాజరు వివరాలు, రిజిస్టర్, ఫార్మసీ తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రతి రోజూ ఆసుపత్రికి వైద్యం కోసం ఎందరు వస్తున్నారో ఆరా తీశారు. ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవల తీరుపై ఆసుపత్రికి వచ్చిన రోగులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండాలని, సిబ్బంది సమయపాలన ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అందుబాటులో లేని సిబ్బంది పట్ల తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ దవాఖానల్లో అందించే సేవలపై అవగాహన కల్పించాలని, ప్రసవాలు జరిగేలా చూడాలని ఆదేశించారు.

**గ్యాస్ స్టవ్ పైనే మధ్యాహ్న భోజనం తయారుచేయాలి : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తనిఖీలో కలెక్టర్**

పెద్దలింగాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాలకు వెళ్లిన కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఎంత మంది విద్యార్థులు ఉన్నారు? ఎంత మంది ఉపాధ్యాయులు ఉన్నారు? అనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

తరగతి గదులను సందర్శించి, ఎన్ని ఎల్ఈడీ ప్యానెల్స్ వివరాలను ఆరా తీశారు. తప్పనిసరిగా మధ్యాహ్న భోజనం గ్యాస్ స్టౌలపై మాత్రమే తయారు చేయాలని ఆదేశించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టీ బోధించాలని తెలిపారు.

# 'తెలంగాణ విమోచన దినోత్సవం' అధికారికంగా జరపాలి



- **బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేశారు. బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి సిరిసిల్ల పట్టణ కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆగస్టు 15, 1947న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, దేశ నడిబొడ్డున ఉన్న తెలంగాణ ప్రాంతం మాత్రం నిజాం నియంతృత్వం, రజాకార్ల అకృత్యాల మధ్య నలిగిపోయింది. నిజాం రాజ్యంలో వందేమాతరం అంటే నేరమైందని, భారత్ మాతా కీ జై నినాదం శిక్షార్హం అయ్యిందని, భారత జాతీయ జెండా త్రివర్ణ పతాకం నిషేధమైందని, తెలుగు భాష పరాయిదిగా మారిందని అన్నారు. పచ్చి మతోన్మాది ఖాసీం రజ్వీ నేతృత్వంలోని రజాకార్ల మూక అకృత్యాలు అన్నీ ఇన్నీ కాదు మనుషలను వరసలో నిలబెట్టి తుపాకీతో కాల్చి చంపడాలు చెట్టుకు కట్టి సామూహికంగా ఉరితీయడాలు మహిళలచే నగ్నంగా బతుకమ్మలు ఆడించడాలు హత్యలు, అత్యాచారాలు, ఆఘాయిత్యాలు, దోపిడీలు, దొమ్మీలు%ొ% చెప్పుకుంటూ పోతే నిజాం రాజ్యంలో ప్రజలు ప్రత్యక్ష నరకాన్ని అనుభవించారు. ప్రస్తుత తెలంగాణ రాష్ట్రం సహా మహారాష్ట్ర, కర్నాటకలోని పలు జిల్లాలతో కూడిన హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసేందుకు ససేమిరా అన్న నిజాం సొంత ఇస్లామిక్ దేశంగా ఉండాలని భావించాడు, కుదరని పక్షంలో పాకిస్తాన్ తో హైదరాబాద్ ను కలిపే ప్రయత్నం చేశాడు. నియంతృత్వాన్ని ఎదిరించిన ఇక్కడి ప్రజల వీరత్వానికి, 'ఆపరేషన్ పోలో' పేరిట పోలీస్ యాక్షన్ చేపట్టిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ధీరత్వం తోడవడంతో, భారత సైన్యం చేతిలో ఓడిన నిజాం 1948 సెప్టెంబర్ 17న లొంగిపోవడంతో తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చిందని అన్నారు.

ఒక ప్రాంతానికి స్వేచ్ఛ స్వాతంత్ర్యం లభించిన రోజంటే అది పెద్ద పండగ రోజు. కానీ తెలంగాణకు స్వాతంత్ర్యం దక్కిన 17 సెప్టెంబర్ మాత్రం ఇక్కడ ఏ ప్రత్యేకతా లేకుండా, నేటి తరానికి తెలియకుండా తొక్కిపెట్టారు. నాటి హైదరాబాద్ సంస్థానంలో భాగమై కర్నాటక, మహారాష్ట్రలో కలిసిన జిల్లాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా విముక్తి దినోత్సవాలను నిర్వహిస్తున్నాయి. అయితే సంతుష్టీకరణ రాజకీయాలకు పెద్దపీట వేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలకులు 17 సెప్టెంబర్ ను అధికారికంగా నిర్వహించేందుకు వెనకడుగు వేశారని అన్నారు.

ఇక్కడి స్వాతంత్ర్య పోరాటం, నిజాంను ఎదిరించిన యోధుల త్యాగాలు, పోరాటాలు నేటి తరానికి తెలియాలన్నా.. వారిని సముచితంగా స్మరించుకోవాలన్నా సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన చినోత్సవాలను అధికారికంగా నిర్వహించాలని 1998లో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బిజెపి రాష్ట్ర శాఖ నిర్ణయించింది. సెప్టెంబర్ 17న అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించాలని డిమాండ్ చేస్తూ నాటి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సీ. హెచ్. విద్యాసాగర్ రావు నేతృత్వంలో పెద్దఎత్తున పోరాటాలు చేసింది. 1998 సెప్టెంబర్ 17న హైదరాబాద్ నిజాం గ్రౌండ్స్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో నాటి కేంద్ర హెూం మంత్రి ఎల్.కె. అద్వానీ పాల్గొన్నారు. అది మొదలు బిజెపి అధికారిక విమోచన ఉత్సవాల కోసం పోరాటాలు కొనసాగిస్తూనే ఉంది. విద్యాసాగర్ రావు తర్వాత రాష్ట్ర అధ్యక్షులైన నల్లు ఇంద్రసేనారెడ్డి బండారు దత్తాత్రేయ, జి. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలోనూ అనేక ఉద్యమాలు నడిచాయని తెలిపారు.2014లో స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాలను అధికారికంగా నిర్వహించుకోవచ్చని ప్రజలు అనుకున్నారు. కానీ నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ద్వంద్వ వైఖరి వల్ల తెలంగాణ ప్రజల ఆశలు అడియాసలే అయ్యాయి. ఉద్యమ కాలంలో 17 సెప్టెంబర్ అధికారికంగా ఎందుకు నిర్వహించరు అని నిలదీసిన కేసీఆర్ అధికారంలోకి రాగానే ఓవైసీలకు తలొగ్గి స్వరం మార్చారు. రజాకార్ల వారసులైన ఎంఐఎంకు భయపడి తెలంగాణ ప్రజల ఆకాంక్షలను వమ్ము చేశారని అన్నారు.కేంద్రమే సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు అధికారికంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా నిర్వహించక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. అయితే, సెప్టెంబర్ 17 ప్రాధాన్యాన్ని తప్పుదారి పట్టించేలా గత ముఖ్యమంత్రి కేసీఆర్ 'జాతీయ సమైక్యతా దినోత్సవం'గా, ప్రస్తుత రేవంత్ రెడ్డి సర్కార్ 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం'గా వేడుకలను అధికారికంగా నిర్వహించారు. పక్కదారి పట్టించే మారుపేర్లతో కాకుండా సెప్టెంబర్ 17 వేడుకలను 'తెలంగాణ విమోచన దినోత్సవం'గానే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నాయకత్వంలో బిజెపి పోరాటాలు కొనసాగిస్తోంది. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాలు జరపాలని 1998లో మొదలుపెట్టిన బిజెపి పోరాటం మధ్యలో కరోనా కారణంగా రెండేళ్లు మినహాయిస్తే 25 ఏళ్లుగా కొనసాగుతోంది. ఈసారి బిజెపి విమోచన ఉద్యమ రజతోత్సవాలను జరుపుకుంటున్నాం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగి సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాలను జరపాలని కోరుకుంటున్నామని, సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని జరుపుకుందాం.. నిజాం, రజాకార్లను ఎదిరించిన యోధులను స్మరించుకుందామని అన్నారు. ఈ సమావేశంలో పార్లమెంటు కో కన్వీనర్ ఆడెపు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతి రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు బర్కం లక్ష్మి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు రాగుల రాజిరెడ్డి, జిల్లా కార్యదర్శి కర్నే హరీష, జిల్లా మీడియా కన్వీనర్ కాసుగంటి రాజు రావు, జిల్లా కార్యాలయ కార్యదర్శి భాగయ్య, జిల్లా కౌన్సిల్ మెంబర్ నాగుల శ్రీనివాస్, చందుపట్ల లక్ష్మారెడ్డి, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్, గంభీరావుపేట్, వీర్నపల్లి మండల అధ్యక్షులు కోడె రమేష్, లకుపతి నాయక్, బిజెపి సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లాలో నేరాలకు పాల్పడిన వారికీ జైలు శిక్ష తప్పదు, శిక్షలతోనే సమాజంలో మార్పు..

- **హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు, రూ.1000/- జరిమానా.**
- **జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**
- **నిందుతుడికి శిక్ష పడటంలో కృషి చేసిన అధికారులను, పిపి, సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ..**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

హత్యకు కారణమైన నిందుతుడికి జీవిత ఖైదు, 1000/– రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రధాన న్యాయమూర్తి నీరజ మంగళవారం రోజున తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. జూలపల్లి మండలం తెలీకుంటకు చెందిన మరిపెల్లి రాజయ్య (64), వేములవాడ శివారులోని మామిడి తోటలో కాపలాదారుగా పనిచేస్తున్నాడు. అతనితో పాటు చింతల్ ఠాణాకు చెందిన మంత్రి ఆనందం కూడా అక్కడే పనిచేస్తున్నాడు. తోటపని, వంటపని విషయంలో వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో రాజయ్య ఆనందంను తిట్టేవాడు. దీంతో మనసులో కక్ష పెంచుకున్న ఆనందం, రాజ య్యను చంపాలని నిర్ణయించుకున్నాడు. తేదీ 29/04/2024 న రాత్రి రాజయ్య తన గది బయట భోజనం చేస్తుండగా, ఆనందం సిద్ధంగా ఉంచుకున్న ఇనుప పారతో రాజయ్య తలపైన కొట్టి చంపాడు.మృతుడు రాజయ్య కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు పంపించారు. అనంతరం దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీంద్ర నాయుడు, కోర్టు కానిస్టేబుల్ మహేందర్, సీఎంఎస్ కానిస్టేబుల్ నవీన్ ఆధ్వర్యంలో 16 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ వాదించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, నేరం రుజువు కావడంతో నిందితుడైన ఆనందంకు జీవిత ఖైదుతో పాటు రూ.1000 జరిమానా విధించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని, శిక్షలతోనే సమాజంలో మార్పు వస్తుందని అన్నారు. పోలీసులు మరియు ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ మరియు న్యాయ నిరూపణ జరిపి కచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని సూచించారు. నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన సీఐ వీరప్రసాద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్, కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీంద్ర నాయుడు, కోర్టు కానిస్టేబుల్ మహేందర్, సీఎంఎస్ కానిస్టేబుల్ నవీన్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.



# ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం..

**బలగం టీవీ, బోయినిపల్లి:**

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైనదని ఎంపీడీవో జయశీల అన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో జయశీల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జయశీల మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఎంతో ఉందని సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరమైందని అన్నారు. మునుముందు విద్యార్థులకు వారి సేవలను అందించి, విద్యార్థులకు మంచి భవిష్యత్ అందించాలని ఆకాంక్షించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపీడీవో జయశీల, ఎంఈఓ శ్రవణ్ కుమార్ తో పాటు పలువురు వివిధ స్థాయిలలో విశిష్ట సేవలు అందించిన 18 మంది ఉత్తమ ఉపాధ్యాయులను మేమేంటో శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భూమయ్య, శ్రీనివాస్, ఉషారాణి, రిటైర్డ్ మాజీ ఎం.ఈ.వో రామరాజు,ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు గసికంటి శ్రీనివాస్, రాములు, ఆనందరావు, జగన్మోహన్, మల్లేశం, ఆయ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రాణాలకు తెగించి రైతును కాపాడిన కానిస్టేబుల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మానేరు వాగులో చిక్కుకున్న రైతు దేవయ్యను కాపాడి, అతని ప్రాణాలను రక్షించిన జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ కానిస్టేబుల్ సురేందర్ అభినందనీయుడు. గంభీరావుపేట మండలం, మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన రైతు దేవయ్య వరద ఉధృతిలో చిక్కుకున్నారని సమాచారం అందుకున్న వెంటనే, కానిస్టేబుల్ సురేందర్ తక్షణమే స్పందించి, తన ప్రాణాలకు తెగించి సాహసంతో రైతును సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఈ సందర్భంగా, జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో కానిస్టేబుల్ సురేందర్‌ను జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు సత్కరించారు. ప్రజల రక్షణ కోసం చూపిన నిబద్ధతకు, ప్రజా సేవకు గుర్తింపుగా ఆయనకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. "ప్రజల ప్రాణాలను రక్షించడానికి తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేసే పోలీసు సిబ్బంది సమాజానికి ఆదర్శం" అని కొనియాడారు. కానిస్టేబుల్ సురేందర్ చూపిన ధైర్యసాహసాలు, కర్తవ్య నిబద్ధత ఎంతోమందికి స్ఫూర్తినిస్తాయని వారు పేర్కొన్నారు.







# టీమిండియా జెర్సీ స్పాన్సర్‌గా అపోలో టైర్స్

**బలగం టీవీ, హైదరాబాద్**

టీమిండియా జెర్సీ కొత్త స్పాన్సర్ పై ఉత్కంఠ వీడింది. భారత క్రికెట్ జట్టు జెర్సీ స్పాన్సర్‌గా అపోలో టైర్స్ బీసీసీఐ తో ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం 2027 వరకు కొనసాగుతుంది. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు సంబంధించిన ప్లాట్‌ఫారమ్‌లపై ఆంక్షల కారణంగా, డ్రీమ్11తో కాంట్రాక్టును బీసీసీఐ మధ్యలోనే రద్దు చేసుకుంది. అనంతరం భారత్ ఎలాంటి స్పాన్సర్ లేకుండానే ఆసియా కప్ ఆడేందుకు వెళ్లడం తెలిసిందే. ఈ క్రమంలో భారత జట్టుకు జెర్సీ స్పాన్సర్‌గా అపోలో టైర్స్ డీల్ కుదుర్చుకుంది. కొత్త ఒప్పందం ప్రకారం అపోలో టైర్స్ ఒక్కో మ్యాచ్‌కు బీసీసీఐ క్రికెట్ బోర్డుకు ?4.5 కోట్లు చెల్లిస్తుంది, ఇది డ్రీమ్11 గతంలో అందించిన ?4 కోట్లను మించిపోయింది. గత డీల్ కంటే ఇప్పుడు ఒక్క మ్యాచ్ ద్వారా రూ.50 లక్షలు అధికంగా బీసీసీకి లాభం చేకూరనుంది. భారత్ బిజీగా అంతర్జాతీయ షెడ్యూల్‌ను కలిగి ఉండటంతో, ఈ ఒప్పందం టైర్ల దిగ్గజానికి భారీ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపును ఇస్తుందని భావిస్తున్నారు. ఈ ఒప్పందం భారత క్రికెట్‌లో అత్యంత విలువైన స్పాన్సర్‌షిప్ ఒప్పందాలలో ఒకటిగా పరిగణిస్తారు. సెప్టెంబర్ 16న స్పాన్సర్‌షిప్ బిడ్డింగ్ నిర్వహించారు. ఇక్కడ అపోలో టైర్స్ ఈ ఒప్పందాన్ని పొందడానికి ఇతర పోటీదారులను అధిగమించింది. ఇతర బలమైన పోటీదారులలో కాన్వా, జెకె టైర్ ఉన్నాయి. అయితే బిర్లా ఆప్టస్ పెయింట్స్ ప్రారంభంలో ఆసక్తి చూపించినా, చివరకు అధికారిక బిడ్‌ను దాఖలు చేయలేకపోయింది.డ్రీమ్11 వివాదం తర్వాత, బీసీసీఐ ఈసారి మరింత జాగ్రత్తగా వ్యవహరించింది. బెట్టింగ్, జూదం, క్రిప్టోకరెన్సీ, ఆన్‌లైన్ గేమింగ్, పొగాకులకు సంబంధించిన కంపెనీలు పాల్గొనడాన్ని బీసీసీఐ నిషేధించింది. అదనంగా, ఇప్పటికే స్పోర్ట్‌వేర్, బ్యాంకింగ్, నాన్-ఆల్కహాలిక్ పానీయాలు, బీమా, అభిమానులు, వినియోగదారుల మన్నికైన వస్తువుల వంటి విభాగాలలో భాగస్వామ్యం కలిగి ఉన్న సంస్థలను ఈ ప్రక్రియ నుండి మినహాయించారు.స్పాన్సర్‌షిప్ బిడ్‌ల కోసం బీసీసీఐ 2 స్పష్టమైన విభాగాలలో ఆంక్షలు విధించింది. ఒకటి నిషేధిత బ్రాండ్ కేటగిరీలు, బ్లాక్ చేసిన బ్రాండ్ కేటగిరీలు.నిషేధిత కేటగిరీలలో ఏ పరిస్థితుల్లోనూ పాల్గొనకూడని కొన్ని పరిశ్రమలు ఉన్నాయి. ఇవి ఆల్కహాల్ ఆధారిత ఉత్పత్తులు, బెట్టింగ్, జూదం సర్వీసెస్, క్రిప్టోకరెన్సీ వెంచర్లు, ఆన్‌లైన్ మనీ గేమింగ్ లేదా ఆన్‌లైన్ గేమింగ్ చట్టం 2025 కింద నిషేధిత కార్యకలాపాలు, పొగాకు ఉత్పత్తులు, ప్రజల నైతికతకు అభ్యంతరకరమైన బ్రాండ్‌లు (అంటే వయోజన కంటెంట్) ఉన్నాయి.. బ్లాక్ చేసిన కేటగిరీలలో భారత క్రికెట్ జట్టు ఇప్పటికే భాగస్వామ్యం కలిగి ఉన్న రంగాలు ఉన్నాయి. అంటే ప్రస్తుత స్పాన్సర్ కాకపోతే ఈ పరిశ్రమల నుండి కొత్త బిడ్డర్‌లను అంగీకరించడం లేదు. ఇందులో అథ్లెజర్, స్పోర్ట్‌వేర్ (అడిడాస్), బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, నాన్-ఆల్కహాలిక్ కోల్డ్ బెవరేజెస్ , ఫ్యాన్లు, మిక్సర్‌ల వంటి గృహోపకరణాలు (ఆటమ్‌బర్గ్ టెక్నాలజీస్), బీమా వంటివి ఉన్నాయి.

# ప్రీక్వార్టర్స్‌కు సింధు

## చైనా మాస్టర్స్ సూపర్ 750లో శుభారంభం

**బలగం టీవీ, హైదరాబాద్**



భారత స్టార్ షట్లర్ పీవీ సింధు చైనా మాస్టర్స్ సూపర్ 750 టోర్నీలో విజయవంతమైన ఆరంభం చేసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఆమె డెన్మార్క్‌కు చెందిన జాకొబ్సెన్‌ను 21-4, 21-10తో ఓడించి ప్రీక్వార్టర్స్‌కి చేరుకుంది.

పురుషుల సింగిల్స్‌లో భారత క్రీడాకారుడు ఆయుష్ పోరాట పటిమ చూపించినప్పటికీ 19-21, 21-12, 16-21తో చైనీస్ తైపీకి చెందిన చౌ టీన్ చెన్ చేతిలో ఓటమిపాలయ్యాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జోడీ రోహన్-రుత్విక జపాన్ ఆటగాళ్లు షిమొగమి-హెుబర చేతిలో 17-21, 11-21 తేడాతో పరాజయం పొందింది.

# యువరాజ్ సింగ్, రాబిన్ ఉతప్పలకు ఈడీ సమన్లు

**బలగం టీవీ, హైదరాబాద్**



బెట్టింగ్ యాప్ కేసు, సహారా గ్రూప్ అంబీ వ్యాలీ ప్రాజెక్ట్‌లోని రూ. 300 కోట్ల ఆస్తుల వ్యవహారానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో టీమిండియా మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, రాబిన్ ఉతప్పలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. సెప్టెంబర్ 22న రాబిన్ ఉతప్ప, 23న యువరాజ్ సింగ్ ఈడీ ముందు విచారణకు హాజరుకావాలని వారికి నోటీసులు అందాయి. యువరాజ్ సింగ్, రాబిన్ ఉతప్పలు పలు బెట్టింగ్ యాప్ లను ప్రమోట్ చేశారని తేలడంతో నోటీసులు అందాయి. చట్టవిరుద్ధమైన బెట్టింగ్ యాప్ తో కేసు ముడిపడి ఉన్నందున మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ వారి స్టేట్మెంట్లను రికార్డు చేయనుంది. మనీలాండరింగ్ కేసులో ప్రముఖ నటుడు సోనూ సూద్ కు కూడా ఈడీ నోటీసులు జారీ చేసింది. ఆయనను సెప్టెంబర్ 24న విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో సూచించింది.ఇదిలా ఉండగా.. గతంలో శిఖర్ ధావన్, సురేష్ రైనాలకు కూడా ఈడీ సమన్లు జారీ చేసింది. బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేసినందుకు వారిద్దరిని ఈడీ విచారించింది. వీరు ఎందుకు ఈ యాప్‌ను ప్రచారం చేశారు, వారికి ఎంత డబ్బు లభించింది, యాప్‌తో వారికి ఉన్న సంబంధాలు ఏమిటి అనే విషయాలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఇప్పుడు ఇదే కేసులో యువరాజ్ సింగ్, రాబిన్ ఉతప్పలను కూడా ఈడీ విచారించనుంది. ఈ కేసులో క్రికెటర్ల ప్రమేయంపై మరింత సమాచారం కోసం ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఈ విచారణల తర్వాత మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# పవన్ కళ్యాణ్ ఓజీకి హైప్

- **ప్రమోషన్స్‌లో బిజీగా ప్రియాంక అరుళ్**

**బలగం టీవీ, హైదరాబాద్**




టాలీవుడ్‌లో విడుదలకు సిద్ధంగా ఉన్న చిత్రం.. 'ఓజీ'. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమాపై హైప్ రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ప్రియాంక అరుళ్ మోహన్ ఎంట్రీతో సినిమాపై క్రేజ్ మరింత పెరిగింది. ఇప్పటికే ప్రియాంక పై విడుదలైన సాంగ్స్, కొన్ని విజువల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ మంచి బజ్ క్రియేట్ చేశాయి. తన గ్లామరస్ ప్రెజెన్స్‌తో పాటు, పవన్ కళ్యాణ్‌తో ఉన్న స్క్రీన్ కెమిస్ట్రీకి ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. కాగా ఆమె ఇప్పుడు సినిమా ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ప్రియాంక తాజాగా ఓజి ప్రమోషన్స్ కోసం బయటికొచ్చి ప్రింట్ మీడియా, వెబ్ మీడియా లకు ఇంటర్వ్యూలు ఇస్తూ చిత్రంపై ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. దీంతో ఈ చిత్రం ప్రమోషన్ల అసలైన జోరు మొదలైందని చెప్పవచ్చు. ఇకపై ప్రియాంకతో పాటు- మిగతా ప్రధాన నటీ-నటు-లు కూడా ఈ ప్రమోషన్లలో భాగం కానున్నట్లు- సమాచారం. ఇక ఈ సినిమా పాన్-ఇండియా లెవెల్‌లో తెరకెక్కుతున్న నేపథ్యంలో, ఇతర భాషల్లో కూడా ప్రమోషన్స్ ఎలా ఉంటాయన్నదే ఇప్పుడు ఫ్యాన్స్‌లో కుతూహలంగా మారింది. ముఖ్యంగా బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ఇందులో కీలక పాత్ర

పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఆయన ఎంట్రీతో ఓజికి హిందీ లోను మంచి మార్కెట్ ఏర్పడింది. అందుకే హిందీలో ప్రత్యేక ప్రమోషన్లు ఎక్కి-లాన్ చేస్తున్నారా? అన్న ప్రశ్న ఇప్పుడు అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడిప్పుడే మొదలైన ప్రమోషన్లతో సినిమా హంగామా మరింత పెరిగేలా కనిపిస్తుంది. రాబోయే రోజుల్లో ఓజి టీ-మ్ నుంచి ఇంకా పెద్ద ప్రమోషనల్ ఈవెంట్స్, స్పెషల్ ఇంటర్వ్యూలు, మ్యూజిక్ ఈవెంట్, ప్రీ-రిలీజ్ ఫంక్షన్ లాంటివి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఈ ప్రమోషన్ లు కలిపి సినిమా కోసం ప్రేక్షకుల అంచనాలను మరింత ఎత్తుకు తీసుకెళ్లడం ఖాయం.

# ప్రభాస్‌తో ప్రశాంత్‌వర్మ మూవీ..!




**బలగం టీవీ, హైదరాబాద్**

జెట్ స్పీడ్‌లో దూసుకుపోతున్న రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. ఇప్పటికే మారుతి దర్శకత్వంలో హర్రర్ కామెడీగా రూపొందుతోన్న రాజాసాబ్ త్వరలో విడుదలకు సిద్ధమవుతుతండగా, సందీప్ రెడ్డి వంగా స్పిరిట్, ప్రశాంత్ నీల్ సలార్ పార్ట్ 2, హను రాఘవపూడి దర్శకత్వంలో పీరియాడికల్ వార్ డ్రామా ఫౌజీ, నాగ అశ్వీన్ కల్కి పార్ట్2 సినిమాలు లైన్‌లో ఉన్నాయి.

ఇదిలా ఉంటే.. మరో ఆసక్తికరమైన అప్డేట్ వినిపిస్తోంది. హనుమాన్ సినిమాతో దేశ వ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న దర్శకుడు ప్రశాంత్ వర్మ తో ప్రభాస్ కొత్త సినిమా త్వరలోనే ప్రారంభం కానుందని తెలుస్తోంది. కొంతకాలంగా సైలెంట్‌గా ఉన్న ప్రశాంత్ వర్మ ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రీ విజువలైజేషన్ పనులను పూర్తి చేశాడని ఇండస్ట్రీలో చర్చ సాగుతోంది. ప్రతి సీన్, ప్రతి క్యారెక్టర్, ప్రతి షాట్ ముందే డిజైన్ చేయబడి ఉన్నట్లు- సమాచారం. దీంతో షఉటింగ్ ప్రారంభమైన తర్వాత కూడా ఈ ప్రణాళిక ప్రకారం సమర్థంగా పని చేయగలరని అంటున్నారు.ఈ సినిమాకు ప్రస్తుతం 'బ్రహ్మ రాక్షస్'అనే వర్కింగ్ -టైటిల్ వినిపిస్తోంది. అయితే, -టైటిల్ మారే అవకాశాలు కూడా ఉన్నట్లు- తెలుస్తోంది. ప్రస్తుతం ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందుతున్న 'హను-మాన్' సీక్వెల్ 'జై హను-మాన్' పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. సినిమాటిక్ యూనివర్స్‌లో ఇది రెండవ పెద్ద చిత్రం కావడం విశేషం. సినిమా హిస్టరీ బుక్స్

కాంతార' ఫేం రిషబ్ శెట్టి హనుమంతుడిగా కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తోంది. ప్రభాస్ అభిమానులు ఆయన ఈ కొత్త సినిమాతో మరోసారి భారీ విజయాన్ని అందిస్తాడని ఆశగా ఎదురుచూస్తున్నారు. షఉటింగ్ ప్రారంభం కాగానే మరిన్ని అధికారిక వివరాలు వెలువడే అవకాశముంది.

# ఆసియా కప్‌లో బంగ్లాదేశ్ కీలక విజయం

- **అఫ్గాన్‌పై 8 పరుగుల తేడాతో గెలుపు**

**బలగం టీవీ, హైదరాబాద్**



తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ సత్తా చాటింది. మంగళవారం అఫ్గానిస్థాన్‌తో జరిగిన ఆసియా కప్ డూ ఆర్ డై పోరులో సమష్టిగా రాణించిన బంగ్లా జట్టు 8 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో సూపర్-4లో చోటు దక్కించుకునే అవకాశాలను సజీవంగా ఉంచుకుంది.

ముందుగా బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 154 పరుగులు చేసింది. ఓపెనర్ తంజిద్ హసన్ (52బీ 31 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో రాణించాడు. సైఫ్ హసన్ (30), టౌహిడ్ హృదయ్ (26) విలువైన ఇన్నింగ్స్ ఆడారు. అఫ్గాన్ బౌలర్లలో రషీద్ ఖాన్ (2/26), నూర్ అహ్మద్ (2/23) ప్రభావం చూపారు. లక్ష్యం చేధనలో అఫ్గాన్ జట్టు 20 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌటైంది. రెహ్మానుల్లా గుర్బాజ్ (35), అజ్మతుల్లా ఒమర్జాయ్ (30), రషీద్ ఖాన్ (20) ప్రయత్నం చేసినప్పటికీ జట్టు విజయానికి సరిపోలలేదు. బంగ్లా బౌలర్లలో ముస్తాఫిజుర్ రెహ్మాన్ (3/28) అదరగొట్టగా, నాసుమ్ అహ్మద్, టస్కిన్ అహ్మద్, రిషద్ హెుస్సేన్ తలో రెండు వికెట్లు తీశారు.

చివరి రెండు ఓవర్లలో అఫ్గాన్ విజయానికి 27 పరుగులు అవసరమయ్యాయి. 19వ ఓవర్ తొలి బంతిని బౌండరీ బాదిన రషీద్ ఖాన్ వెంటనే క్యాచ్ ఔట్ కావడంతో మ్యాచ్ గమనం మారింది. అదే ఓవర్‌లో మరో వికెట్ తీసిన ముస్తాఫిజుర్ కేవలం 5 పరుగులకే పరిమితం చేశాడు. చివరి ఓవర్‌లో 22 పరుగులు అవసరమయ్యే పరిస్థితిలో అఫ్గాన్ పూర్తిగా తడబడింది.

ఈ విజయంతో గ్రూప్-బీ సమీకరణాలు రసవత్తరంగా మారాయి. వరుసగా రెండు విజయాలతో శ్రీలంక టాప్‌లో ఉండగా, రెండు గెలిచి ఒకటి ఓడిన బంగ్లాదేశ్ రెండో స్థానంలో ఉంది. అఫ్గానిస్థాన్ ఒక విజయం, ఒక పరాజయంతో మూడో స్థానంలో ఉంది. ఇప్పటికే హాంగ్‌కాంగ్ టోర్నీ నుంచి తప్పుకుంది. అఫ్గాన్- శ్రీలంక మధ్య జరగబోయే ఆఖరి మ్యాచ్ ఫలితం సూపర్-4లోకి ఎవరు అడుగు పెడతారన్నది నిర్ణయిస్తుంది.